# చెలగాటం

శేఖర్ మా పెదనాన్నగారబ్బాయి.

సహోదరులం కాకపోయినా చిన్నప్పటినుండీ ఒకే వూర్లో వుండడం వలన స్వంత అన్నాచెల్లెళ్ళలాగే పెరిగాం మేమిద్దరమూ.

అంటే యిద్దరిమధ్యా గొప్ప ప్రేమ వుందని కాదు. చనువు వుందంతే. నిజానికి వాడి అభిప్రాయాల్లో ఒక్కటీ నాకు నచ్చదు. ఒక్కొక్క వయసులో ఒక్కొక్క రకమైన వాదన జరుగుతూండేది వాడితో.

చిన్నప్పుడు.. నేను చదువులో వాడికన్నా ప్రతిభ కనపర్చిన సందర్భాలలో.. "ఆడపిల్లలు చదివేం చేస్తారు! వాళ్ళకసలు చదువెందుకు!" అన్న ధోరణిలో మాట్లాడేవాడు.

నేను వూరుకునేదాన్ని కాదు.

ఆతర్వాత.. వాడి పెళ్లి టైం వచ్చేసరికి హటాత్తుగా ఆడపిల్లల చదువు విలువా.. వుద్యోగం విలువా తెలిసొచ్చాయి. "నాకు వుద్యోగం చేసే అమ్మాయి కావాలి." అన్న కోరిక బయట పెట్టాడు.

"అదేమిట్రోయ్!" అన్నాను నేను.

"అదికాదే! నాదీ చిన్న వుద్యోగం.. రోజులు చూశావుగా ఎలా వున్నాయో! మరీ ప్రతి విషయానికీ.. ఒక సినిమాకి వెళ్ళాలన్నా కూడా చూసుకుంటూ ఏం బ్రతుకుతాం చెప్పు. ఆ అమ్మాయి సరదాలు తీర్చడం కోసమయినా.." అంటూ చెప్పుకొచ్చాడు.

లాజిక్ వున్నట్లే కనిపిస్తాయి యిలాంటి మాటలు. చప్పున మరో ప్రశ్న కూడా స్ఫురించదు. అంత పకడ్బందీగా వుంటాయి ఈ తరహా వాదనలు. కానీ ఎందుకో మనసుకు మాత్రం నచ్చవు. ఏదో అసంతృప్తి తొలుస్తూ వుంటుంది.

నిజానికి నాకు వుద్యోగం చేయడమంటేనే యిష్టం. అప్పటికే నేను వుద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను కూడా.

కానీ వాడిమాటలు మాత్రం నాకు నచ్చలేదు. కాబోయే భార్య వుద్యోగం మీద వాడికి వున్న ఆశో! అభిప్రాయమో! అవసరమో!.. దానికేం పేరు పెట్టాలో తెలీదు కానీ అది నాకు నచ్చలేదు.

అలా అని వాడి మాటల్ని ఖండించడమూ చేతకాలేదు. సరైన సమాధానం చెప్పలేకపోవడం చాలా అసంతృప్తిని కలిగించింది.
సాధారణంగా మేమిద్దరం ఎప్పుడు వాదించుకున్నా అంతిమవిజయం నాదే అయ్యేది. ఈ ఒక్క విషయంలోనే నేను వాడి మాటల్ని త్రిప్పి కొట్టలేకపోయాను.
కారణం ఏమిటి! వాడి మాటలు కరెక్ట్‌గానే ఉన్నాయేమో! మరి నాకెందుకు నచ్చలేదు!!
చాలా సిన్సియర్‌గా ఆత్మవిమర్శ చేసుకున్నాను. మాఫ్రెండ్ సుధతో కూడా చర్చించాను. "సరేలేవే! నా భార్య వుద్యోగం చేయక్కర్లేదు - అని వాళ్ళంటే మాత్రం మనం మానేస్తామా ఏమిటి!" అంది అది.
"మానేయం అనుకో." నసిగాను నేను.
"మరి! చేయక్కర్లేదు.. అనడం వినడానికి బాగుందంటావా! హీరోయిజం కనిపిస్తోందా అందులో!"
నేను మాట్లాడలేదు.
"నాకైతే కనపడటం లేదు. ఆమాటకొస్తే "వుద్యోగం చేయాలి" అనడంలోనే కాస్తో కూస్తో ప్రాక్టికల్ థింకింగ్ వుంది." అంది.
నాకు హటాత్తుగా అర్థమయింది.
సమస్య వుద్యోగం చేయడం గురించీ, చేయకపోవడం గురించీ కాదు. ఆ విషయాన్ని మరొకరు నిర్ణయించడం గురించి.
ఆడవాళ్ళు చదువుకోవాలా! అక్కర్లేదా! వుద్యోగం చేయాలా! అక్కర్లేదా! అంటూ ప్రశ్నలేమిటి! చర్చలేమిటి! వాటిగురించి మరెవరో తీర్మానించడమేమిటి! ఇదీ అసలు భరించలేని విషయం.
ఏమయితేనేం! మాఅన్నయ్య కోరుకున్నట్లుగా వాడికి వుద్యోగస్థురాలితోనే పెళ్ళయ్యింది. పెళ్ళికూతురు ఎవరో కాదు. మా సుధే.
మామధ్య చర్చ జరిగిన నాల్రోజులకే దానికి ఒక మల్టీ నేషనల్ కంపెనీలో వుద్యోగం రావడం.. వాళ్ళ వాళ్ళు సంబంధం వెతుక్కుంటూ మా పెదనాన్న దగ్గరికి రావడం.. మా అన్నయ్య ఎగిరి గంతేసి పెళ్ళికి ఒప్పుకోవడం.. అన్నీ చాలా స్పీడ్‌గా జరిగిపోయాయి.

వాళ్ళని చూసినవాళ్ళందరూ "మేడ్ ఫర్ ఈచ్ అదర్" అన్నారు.

"నిజమే" అనుకున్నాను నేను. సుధలాగా నాలుగువైపుల నుంచీ ఆలోచించగల అమ్మాయి అయితే తప్ప వాడితో సర్దుకుపోలేదు.

నాలాంటిది అయితే వాడి ఆలోచనలలోని స్వార్ధాన్ని ఒక్క రోజు కూడా భరించలేదు.

అయితే సుధ.. ప్రాక్టికల్ థింకింగ్‌ని యిష్టపడే సుధ.. వూహలూ.. కలలూ.. భావాలూ.. సున్నితత్వమూ అంటూ మాట్లాడని సుధ కూడా వాడి ధాటికి బెదిరిపోయింది.

మనిషి రక్తం మరిగిన పులితోనయినా సహజీవనం చేయచ్చేమో కానీ.. భార్య వుద్యోగం రుచి తెల్సిన మగవాడ్ని ప్రేమించడం కష్టమని దానికి అర్ధమయింది.

రెండు సంవత్సరాలపాటు చిన్న చిన్నగా రాజుకున్న అసంతృప్తులు ఒకరోజు సుధ పెట్టె పట్టుకుని పుట్టింటికి వెళ్ళిపోవడంతో బయటపడ్డాయి.

పెద్దలందరూ హడావిడిగా రంగంలోకి దిగారు.. రాజీ చేసేందుకు.

సుధ చెప్పింది.. ప్రొద్దున ఎనిమిదయినా లేవడట. అది నానాహడావుడీ పడి పని చేసుకుంటుంటే .. వాడు తాపీగా నిద్రపోతాడట. రాత్రి తొమ్మిదయినా యింటికి రాడట. అది యింటికి వచ్చి, పనంతా చేసుకుని, వంటచేసి.. నిద్రకళ్ళతో ఎదురుచూస్తూ కూర్చుంటే.. అప్పుడొచ్చి పెత్తనం చేస్తాడట. వాడు కోరుకున్నంత సహనంగా సేవ చేయలేకపోతే.. "మొగుడికి అన్నం పెట్టడం కూడా చేతకాదు." అని విసుక్కుంటాడట.

దాంతో అది ఏడుస్తూ అభోజనంగా పడుకున్నా వాడికేమీ పట్టదుట.

ఇలా చాలా చెప్పింది.

"హౌ సిల్లీ!" అనుకున్నారు మా పెద్దవాళ్ళు.

"ఇవసలు ఓ కారణాలేనా!" అంటూ తీసిపారేశారు.

కొంచెం అర్ధం చేసుకున్న మా అమ్మలాంటి వాళ్ళు మాత్రం "ఏం చేస్తామమ్మా! తప్పదు. మగవాళ్ళు పెళ్ళాన్నుంచి ఆశించేది అదే. దగ్గర కూర్చుని సహనంగా అన్నం పెడితే వాళ్ళకి సంతోషం. "నేను కూడా వుద్యోగం చేస్తున్నాను కదా, అయినా పనంతా నేనే ఎందుకు చేయాలి.." - యిలాంటి వాదనల వల్ల ప్రయోజనం లేదు. భర్తకి అలా సహనంగా సేవ చేయడంలో.. అన్నం పెట్టడంలో.. వీటిల్లోనే ఆడవాళ్ల అందం వుంది." అన్నారు.

"అహా! భార్య చేత చాకిరీ చేయించుకోవడంలో.. అన్నం తినడంలో.. మగవాళ్ల అందం వుందా!" అన్నాను నేను.

"నోరుమూసుకో" అని అందరూ కోరస్‌గా కసిరారు. మరి నాకు పెళ్ళవలేదుగా! మాట్లాడే అర్హత లేదు.

చిత్రమేమిటంటే.. మావాళ్ళ మాటలతో పై లిస్టుకి సంబంధించినంతవరకూ సుధ మెత్తబడింది.

అయినా చేయడం గురించి దానికేం బాధ లేదట. నిజానికి అలా సేవ చేయడం దానికి యిష్టమేనట. కానీ ఓపిక లేక చేయలేక పోతోందిట... అది నసుగుతూ చెప్తుంటే అందులోని విషాదం నా ఒక్కదాని గుండెనే తాకింది.

నిజమే. ఓర్పుగా పని చేయాలంటే ఓపిక కావాలి. సహనంగా వుండాలంటే శక్తి కావాలి. ఎంత లాజిక్ వుంది అందులో!

శక్తికి మించిన పని చేయిస్తూ.. పైపెచ్చు సహనంగా చేయమనడం!

మనిషిని ఒక యంత్రంలాగా చూస్తున్నారు బానేవుంది. ఒక యంత్రం చేసినంత పని చేయి అంటున్నారు.. బానేవుంది.. అంతపనీ యంత్రం లాగా నోరుమూసుకుని చేయి అంటే! దారుణం కాదూ!

నెత్తిమీద నాలుగు మొట్టి "అరవకు." అనడం అన్న మాట. నాకు కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

కానీ మావాళ్ళకి యిదేమీ పట్టలేదు. "సరే. సరే. చెప్పావు కదా! ఆ పాయింట్ అయిపోయింది.. తీర్చిచ్చేశాం." అన్న ధోరణిలో.. "నెక్స్ట్" అన్నారు కొంచెం విసుగ్గా.. కొంచెం హడావిడిగా.

రెండు నిమిషాలు మౌనంగా పూరుకుని.. అది బెదురు బెదురుగా మరో లిస్టు చెప్పింది. "ఆయనకి ఎంత జీతం వస్తుందో.. ఎంత ఖర్చవుతుందో.. ఒక్క పైసా కూడా లెక్క చెప్పరు. నా జీతానికి సంబంధించి మాత్రం ప్రతివిషయమూ అడుగుతారు. ఇంట్లోకి కావల్సినవి ఏం కొనాలన్నా "నా దగ్గర డబ్బుల్లేవు." అంటారు. ఎపుడయినా మంచి చీరల్లేవని తడుముకుంటుంటే.. జీతం రాగానే కొనుక్కో అంటారే తప్ప తన చేత్తో ఒక్క పదిరూపాయలు కూడా నాకోసం ఖర్చుపెట్టరు. అన్ని సమస్యలూ వెధవ ఉద్యోగం మూలంగానే కదా! అని విసుగేసి వుద్యోగం మానేస్తానంటే..."

అక్కడిదాకా చెప్పి గొల్లున ఏడ్చింది అది. తల్చుకుని, తల్చుకుని ఒక అయిదు నిమిషాలు ఏడ్చి. . ఆ తర్వాత చెప్పింది. "ఉద్యోగం మానేసేట్లయితే నువ్విక్కడ వుండనక్కరలేదు . . ఆ వుద్యోగం చూసే చేస్కున్నా నిన్ను." అన్నారు."

అందరూ గిర్రున తలత్రిప్పి మాఅన్నయ్య వైపు చూశారు. "ఏరా! అన్నావా!" అన్నట్లు.

"ఏదో కోపంలో అన్నాను." వాడు నెమ్మదిగా చెప్పాడు. "నామీద కోపంతో అంత మంచి వుద్యోగం మానేస్తాననడం తెలివితక్కువతనం కాదా మరి!" అన్నాడు బింకంగా.

మొదటివాక్యంతో వాడి సంజాయిషీ అయిపోయింది. రెండో వాక్యంతో మళ్ళీ వాడి ఆధిపత్యం వాడికి వచ్చేసింది. అందరూ ఫుల్ సపోర్టిస్తూ "నిజమే. ఉద్యోగం మానేస్తే ఎలా!" అన్నారు.

అక్కడితో రాజీ అయిపోయింది. ఒక్క విశ్లేషణ కానీ. . తీర్మానంగానీ లేకుండానే సభ ముగిసింది. సుధ మళ్ళీ అన్నయ్య దగ్గరికి వెళ్ళింది. ఆ మర్నాడే నా ఎంగేజ్‌మెంట్.

ఆరాత్రి. .

మానాన్నగారు భోజనం చేసి వాకిట్లో కూర్చుని వుండగా. . మాఅమ్మ ఆయన ప్రక్కనే కూర్చుని వక్కపొడి అందిస్తుండగా. . నేను వెళ్ళి అడిగాను. "నాన్నా! నేను తప్పకుండా పెళ్ళి చేసుకోవాలా!" అని.

"అదేం ప్రశ్న! పిచ్చి ప్రశ్న." నాన్న నవ్వారు.

"కాదు. నిజంగానే అడుగుతున్నా. ఉద్యోగం, పెళ్ళి రెండూ చేయాలా నేను!"

"పెళ్ళి చేసుకోవాలి. ఉద్యోగం సంగతి తర్వాత నీ యిష్టం. . నీ మొగుడిష్టం." అంది అమ్మ.

ఆ తర్వాత. . . ఒక పదినిమిషాలపాటు నేను నా గుండెని రాయి చేసుకున్నా. నా సర్టిఫికెట్లూ. . అగ్గిపెట్టే పట్టుకుని మందారచెట్టు దగ్గరికి వెళ్ళి కూర్చున్నా.

అయిదునిమిషాల తర్వాత నేను చేసే పని చూసి మా అమ్మా. . . ఆవిడ పెట్టిన కేక విని మా నాన్నా. . పరుగెత్తుకుంటూ నా దగ్గరికి వచ్చారు.

"ఏమిటే యిది!" అంది మా అమ్మ నివ్వెరపోతూ.

"పెళ్ళో. . వుద్యోగమో. . ఏదో ఒకటే చేయాలనుకున్నా నేను. నాన్న, నువ్వూ పెళ్ళి ముఖ్యమన్నారుగా. . అందుకని సర్టిఫికెట్స్ కాల్చేస్తున్నా."

"అంటే! . ." నాన్న కసిరారు. "మేము పెళ్ళి ముఖ్యం అంటే యిక వుద్యోగం చేయవా! నీకో వ్యక్తిత్వం లేదూ! ఇంత చదువూ చదివి యింట్లో కూర్చుంటావా! అదంతా నిరుపయోగం చేసుకుంటావా!"

నా గుండె ఆనందంతో కేరింతలు కొట్టింది. "ఓహోహో!" అంటూ పల్లెవాళ్ళ స్వరంతో ఎగతాళిగా అరవాలనిపించింది. "కాలికేస్తే వేలికీ, వేలికేస్తే కాలికీ వేస్తారా! ఈ పప్పులేం నా దగ్గర వుడకవు." అనాలనిపించింది. ఎలాగో నిగ్రహించుకుని నాన్నవైపు చూశాను.

"మీరు చెప్పారని కాదు. . నేను కూడా ఆలోచించా. ఉద్యోగమా. . పెళ్ళా అనుకుంటే పెళ్ళే చేసుకోవాలనిపించింది." గొంతు సవరించుకుని కంటిన్యూ చేశాను.

"మూడు పాయింట్లు నాన్నా! ఒకటి. పెళ్ళితో చాలా సరదాలూ. . కోరికలూ తీరతాయి.

రెండు. ఉద్యోగం లాంటి బర్డెన్ లేకపోతే పెళ్ళిని ఆడవాళ్ళు బాగానే ఎంజాయ్ చేయచ్చు.

మూడు. పెళ్ళి చేసుకుంటే పిల్లలు పుడతారు. . ఐ మీన్. . ఉద్యోగం చేస్తున్నా పుడతారనుకోండి. . కానీ. ."

నాన్న మొహం చూస్తే నవ్వొచ్చింది. నాకేమయినా పిచ్చెక్కిందేమోనన్నంత భయంగా ఆయన బిత్తరపోయి చూస్తుంటే జాలేసింది.

ఇంకేమన్నా కాలకుండా మిగిలాయేమోనని అమ్మ ఆత్రంగా సర్టిఫికేట్లని బయటకి లాగే ప్రయత్నం చేస్తోంది. గాలికి వంటిమీద పడిన మసిని దులుపుకుంటూ నేను పైకి లేచాను.

"కంగారు పడకండి నాన్నా! నాకేం కాలేదు. నేను బాగా ఆలోచించే ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం తీసుకున్నాను. ఒక్కటే కారణం. నాకూ మీకూ కూడా నా పెళ్ళిమీద మోజు ఎక్కువగా ఉండడం.

ఉద్యోగం మీద మోజు ఎక్కువగా వుంటే పెళ్ళి మానేసేదాన్ని. కనీసం ఆ మోజు తీరేవరకూ ఉద్యోగం చేసేదాన్ని. రెండూ చేసే ప్రసక్తి మాత్రం లేదు.

ఎందుకనంటారా! నా వంటికి సరిపడదంతే. సుధకే కష్టమవుతుంటే నాలాంటి అమ్మాయికి అసలు చేతకాదు.

నాన్నా! భరించేవాడు భర్త కదా! అహ. డెఫినిషన్ ప్రకారం అంతేకదా!
అతడ్ని అలాగే వుంచడం భార్య ధర్మం కదా! అనవసరంగా వుద్యోగం చేసి.. అతడి
బాధ్యతల్ని అతను మర్చిపోయేలా చేసి.. భర్త అనే డెఫినిషన్‌కే అతన్ని దూరం చేసి..
ఎందుకు చెప్పండిదంతా!"
నా ధోరణికి అమ్మకీ నాన్నకీ కూడా నవ్వొచ్చింది.
మెల్లగా వెళ్ళి నాన్న పొట్ట చుట్టూ చేతులు వేసి.. భుజం మీద తలపెట్టుకుని చెప్పాను.
"నేను చదివిన చదువు వేస్ట్ ఏం కాలేదులే నాన్నా! చదువు అసలైన ప్రయోజనం ఉద్యోగం
కాదు కదా! జీవితాన్ని చక్కదిద్దుకోవడం.
నేనిపుడు చేసిన పని అదే.
నా చదువు నాకిచ్చిన వివేకంతో నా ప్రవర్తనకి.. ప్రవృత్తికి .. వుద్యోగమూ, పెళ్ళి
రెండూ సరిపడవని తేల్చుకున్నాను.
నా అనుభవంలోకి వచ్చిన విషయాలని చాలా సైంటిఫిక్‌గా, లాజికల్‌గా అనలైజ్ చేసి ఈ
నిర్ణయం తీసుకున్నాను. తీసుకున్న నిర్ణయాన్ని నా చదువిచ్చిన ధైర్యంతో
కాన్ఫిడెంట్‌గా చెప్పగలుగుతున్నాను.
సో.. నేను వుద్యోగం చేయాల్సిన అవసరం లేదన్న తీర్మానం జరిగిన తర్వాతనే ..
ఎంగేజ్‌మెంట్ జరుగుతుంది."
ఆ మాట చెప్పేసి నేను ఒక్క పరుగుతో యింట్లోకొచ్చాను. ఫోన్ అందుకుని, నంబర్
త్రిప్పి, సుధ హలో అనగానే నే చేసిన ఘనకార్యం చెప్పాను.
ఒక్క క్షణం మౌనం తర్వాత అది చాలా సంతోషంగా.. "కంగ్రాట్యులేషన్స్" అంది.
ప్రక్క నుంచి శేఖర్ "ఏంటి! ఏంటి!" అని ఆసక్తిగా అడగడం వినిపిస్తోంది.
"అన్నయ్య మీద విజయం అని చెప్పు." నేను పెద్దగా నవ్వి ఫోన్ పెట్టేశాను.

*****